ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 01 జులై , 2026 | పేజీలు : 7

## నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సిఎంకి ఎమ్మెల్యే కుంభం వినతి



ప్రజాపక్షం/యాదాద్రి : బస్వాపురం ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పెండింగ్లో ఉన్న పరిహార నిధులను తక్షణమే విడుదల చేసి, నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రంగారెడ్డి జిల్లా బండరావిరాల వద్ద ఉన్న డంపింగ్ యార్డు ప్రభావం పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామ శివారుపై పడుతున్నందున, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.

# ఉద్యాన పంటల సాగుకు రాయితీలు

## 2026-27లో సూర్యాపేట జిల్లాకు రూ.12.36 కోట్ల ప్రణాళిక



**ప్రజాపక్షం/సూర్యాపేట** : పండ్లు, కూరగాయలు, పూలు వంటి అధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటలు సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృత స్థాయిలో రాయితీలు అందిస్తున్నాయి. తాజాగా 2026/27 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన వార్షిక ప్రణాళికల కింద సూర్యాపేట జిల్లాకు రూ.12.36 కోట్ల మేర నిధులు కేటాయించింది. ఈ ప్రణాళికలలో ఆయిల్ ఫామ్ సాగు, సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, సూక్ష్మ నీటి పారుదల పథకం, వెదురు మిషన్ వంటి పథకాలు ఉన్నాయి. జిల్లా రైతులు ఈ పథకాల ప్రయోజనాన్ని వినియోగించుకోవాలంటే అవసరమైన మౌలిక వసతులు కలిగి ఉండాలి. భూమి, నీరు, విద్యుత్ వసతి కలిగిన రైతులు ఆయా డివిజన్ ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవల్సి ఉంది.

**ఆయిల్ ఫామ్ సాగుకు భారీ ప్రోత్సాహం...**

ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. వరి వంటి సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు భారీ స్థాయిలో ప్రణాళికలు రూపొందించింది. గత నాలుగు సంవత్సరాలలో రైతులు జిల్లాలో 5751 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు కాగా, 2026 27లో మరో 1000 ఎకరాలకు లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో ఈ సాగుకు తెలంగాణ ఆయిల్ ఫెడ్ను కార్యనిర్వాహక ఏజెన్సీగా నియమించారు. ప్రస్తుతం టన్ను ధర రూ.23,800 ఉండగా, ఎకరాకు సగటున 810 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ సాగు ద్వారా ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు ఆదాయాన్ని రైతులు గడిస్తున్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలు నాటడం, తోటల నిర్వహణ, అంతర పంటలకు ప్రభుత్వ రాయితీలు అందుబాటులో ఉన్నాయి. బిందు సేద్యానికి గరిష్టంగా 12.5 ఎకరాల వరకు రైతులకు నాలుగేళ్లలో రూ.50,918 రాయితీ లభిస్తుంది. ఇందుకు గాను ప్రభుత్వం రూ.5.09 కోట్లు కేటాయించింది.

**సూక్ష్మ నీటి పారుదల పథకం...**

బిందు, స్ప్రింక్లర్ సేద్య పద్ధతుల ద్వారా నీటి వినియోగాన్ని సమర్థంగా చేయడం ఈ పథక ఉద్దేశ్యం. ప్రభుత్వ అనుమతి పొందిన కంపెనీల ద్వారా రైతుల క్షేత్రాల్లో వ్యవసాయ పరికరాలను అమర్చనున్నారు. బిందు సేద్యం 2684 ఎకరాలు (రూ.547.09 లక్షలు), గరిష్ట పరిమితి 12.5 ఎకరాలు ఉండగా రాయితీ శాతం ఎస్సి, ఎస్టి రైతులకు 90, బిసి/చిన్న రైతులకు 80, ఇతరులకు 70 శాతం చొప్పున రాయితీ లభిస్తుంది. వెదురు మిషన్ గట్ల వెంబడి వెదురు మొక్కలు నాటి అదనపు ఆదాయం పొందేందుకు 50 శాతం రాయితీ అందించనున్నారు. మొక్కలకు రెండేళ్ల పాటు సబ్సిడీ లభించనుంది (మొదటి సంవత్సరం రూ.90, రెండవ సంవత్సరం రూ.60) మొత్తం 30 ఎకరాలకు గాను రూ.4.32 లక్షలు కేటాయించారు.

**సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం...**

ఈ పథకం కింద కొత్త తోటల స్థాపన, నాణ్యమైన కూరగాయల నారు పంపిణి, పూల తోటల పెంపకం, పాత తోటల పునరుద్ధరణ, నీటి కుంటల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఈ పథకం ద్వారా రైతులు పళ్ళ తోటలు, కూరగాయలు, పూలు సాగు చేసుకోవడానికి 4050 శాతం సబ్సిడీ పొందవచ్చు. పాత తోటలను పునరుజ్జీవింప చేసుకోవచ్చు. ఈ ఏడాది రూ.160.06 లక్షల కేటాయింపు ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం ద్వారా రైతులు పళ్ళ తోటలు, కూరగాయలు, పూలు సాగు చేసుకోవడానికి 4050 శాతం సబ్సిడీ పొందవచ్చు. పాత తోటలను పునరుజ్జీవింప చేసుకోవచ్చు. ఈ ఏడాది రూ.160.06 లక్షల కేటాయింపు ఉంది.

**ఏ పంట సాగుకు ఏ సహాయం ఎంతంటే...**

పళ్ళ తోటలు (మామిడి, నిమ్మ, జామ, దానిమ్మ, పనస, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో తదితరాలు) 32 హెక్టార్లు లక్ష్యం కాగా రూ.17.40లక్షలు అందనుంది. హైబ్రిడ్ కూరగాయలు, ఉల్లిపాయ సాగు 52 హెక్టార్లు రూ.12.48లక్షలు, పూలసాగు (లూజ్ ఫ్లవర్స్) 10.41 హెక్టార్లు రూ.2.08లక్షలు, పాత తోటల పునరుజ్జీవనం 62హెక్టార్లు రూ.14.88లక్షలు, ఫారమ్ పాండ్స్ (నీటి నిల్వ) 4 నిర్మాణాలు రూ.3.60 లక్షలు, ప్లాస్టిక్ మల్చింగ్/షెడ్ నెట్ హౌస్ 40 హెక్టార్లు రూ.8లక్షలు రానుంది. యాంత్రీకరణ (ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు) 31 యూనిట్లు రూ.14.42 లక్షలు, పాక్ హౌస్ (పంట తర్వాత నిల్వ, పంపిణీ) 5 యూనిట్ల 12లక్షలు మొత్తం రూ.160.06 లక్షల నిధులు కేటాయించబడినట్లు అధికారులు తెలిపారు.

**రాష్ట్రీయ కృషి వికాస్ యోజన...**

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా తీగజాతి కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు ఈ పథకం రూపొందించబడింది. ఒక్క యూనిట్కు రూ.50వేల రాయితీ లభిస్తుంది. ఒక్క రైతుకు గరిష్టంగా ఐదు యూనిట్ల వరకు అనుమతించనున్నారు. మొత్తం 30 యూనిట్లకు రూ.15లక్షలు మంజూరయ్యాయి.

**రైతులు దరఖాస్తు చేసుకోవాలి : జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య**



ఉద్యానవన పంటల సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య రైతులను కోరారు. ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు, పూలు తదితర ఉద్యాన పంటలు అధిక ఆదాయాన్ని అందించే వ్యవసాయ శాఖ అని, ఈ పంటల సాగుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక రాయితీలతో ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. 202627 సంవత్సరానికి సంబంధించి జిల్లాకు రూ.1236 లక్షల ప్రణాళికలు మంజూరయ్యాయి. ఆయిల్ ఫామ్, పండ్లు, పూలు, బిందుస్ప్రింక్లర్ మెతుకులు, వెదురు మొక్కలపై పలు రాయితీలు, మౌలిక వసతుల ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. సంబంధిత డివిజన్ అధికారులను రైతుల సంప్రదించాలని కోరారు.

## ఆలేరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని సిఎం రేవంత్ రెడ్డి హామీ

### భూనిర్వాసితులకు రూ.300 కోట్ల పరిహారం విడుదలకు సానుకూలత

### వాసాలమర్రి సామూహిక గృహప్రవేశాలకు రావాలని సీఎంకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆహ్వానం

ప్రజాపక్షం/యాదాద్రి : 'ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు' ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మంగళవారం హైదరాబాద్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రిని కలిసిన బీర్ల అయిలయ్య, నియోజకవర్గంలోని పలు కీలక సమస్యలు, అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా గంధమల్ల, బస్వపూర్ రిజర్వాయర్ల నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు, వైటీడీఏ పరిధిలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే న్యాయం చేయాలని కోరారు. బస్వపూర్ నిర్వాసితులకు రూ.100 కోట్లు, గంధమల్ల భూసేకరణకు రూ.100 కోట్లు, వైటీడీఏ పరిధిలో భూసేకరణ కోసం మరో రూ.100 కోట్లు కలిపి మొత్తం రూ.300 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా, ముఖ్యమంత్రి అందుకు అంగీకరించినట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో కూల్చివేసిన ఇళ్ల అంశాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్ళినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం ఆ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కింద 120 ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే కొంతమంది గృహప్రవేశాలు చేసుకున్నారని వివరించారు. త్వరలో గ్రామంలో పండుగ వాతావరణంలో నిర్వహించనున్న సమూహా గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకావాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యా మరియు వైద్య రంగాల



అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని సీఎం పేర్కొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ భేటీ నియోజకవర్గ భవిష్యత్తుకు ఎంతో ఊతమిస్తుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.



## హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాపక్షం/చివ్వెంల : మండలంలోని వల్లభాపురం గ్రామం వద్ద కొలువై ఉన్న ఏచర్ల ముత్యాలమ్మ దేవస్థానంలో హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. ఏప్రిల్ నుంచి జూన్ నెలల వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.44,755 వచ్చినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఆలయ ఈఓ సత్యనారాయణ, సర్పంచ్ బానోత్ వీరేశ్, ఆర్‌ఐ శ్రీను, కార్యదర్శి మధు, జిపిఓ వెంకన్న, కానిస్టేబుల్ సురేష్, మాజీ సర్పంచ్ మొగదాల లక్ష్మణ్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, బైరు రవీందర్, నారాయణ, ఆలయ సిబ్బంది శేఖర్, శ్రీశైలం సమక్షం లో హుండి లెక్కింపు నిర్వహించారు. భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


## నకిలీ విత్తనాలు అరికట్టాలి




ప్రజాపక్షం/మోతె : నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలని ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కోట మధుసూదన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కునుకుంట్ల సైదులు అన్నారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు రైతుభరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదని వెంటనే రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం సరికాదని చెప్పారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహశీల్దార్ వెంకన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ షేక్ హైమద్, ముత్తయ్య, లింగయ్య, మల్లయ్య, వీరయ్య, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మండలంలోని గూడెపుకుంట తండలో మంగళవారం విద్యుత్ షాక్ తగిలి ఒక గేదె మృతి చెందింది. తండాకు చెందిన మహిళా రైతు గుగులోతు లక్ష్మికి చెందిన సుమారు రూ.1లక్షా30 వేల విలువైన పాడి గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తమకు జీవనాధారమైన గేదె మృతి చెందడంతో చేతి కందివచ్చిన ఆదాయం కోల్పోయామని, తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, తమను ఆదుకొని తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం



ప్రజాపక్షం/మునగాల: తెలంగాణ రాష్ట్రంలో మహానగరం హైదరాబాద్ నుండి మారుమూల పల్లెల వరకు నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం కెసిఆర్ చేసిన అభివృద్ధే తప్ప, ప్రస్తుతం 30నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేసిన అభివృద్ధి శూన్యమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కలకోవ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీని ఆయన సందర్శించి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాటి కెసిఆర్ ప్రభుత్వంలో తాను కోదాడ ఎమ్మెల్యేగా కలకోవ గ్రామంలో ఇండ్లు లేని పేదల కోసం 40 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయించి నిర్ణిత కాలంలో పూర్తి చేసి గ్రామంలోని పేద ప్రజలకు వాటిని అందజేయడం జరిగిందని నాటి నుండి నేటి వరకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టిపోసి కాలనీలో మౌళిక వసతుల ఏర్పాటు కోసం కృషి చేయకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తొగరు రమేష్, సీనియర్ నాయకులు సుంకర అజయ్‌కుమార్, కందిబండ సత్యనారాయణ, ఉడుం కృష్ణ, దొంగరి శ్రీను, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పత్తిపాక లక్ష్మీ నారాయణ, వీరబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్ పోలీసుల సత్వర స్పందన




ప్రజాపక్షం/హుజూర్‌నగర్: పట్టణ పోలీసులు సత్వర స్పందన, సిసి కెమెరాల నిఘా నెట్‌వర్క్ సహాయంతో మహిళ పోగొట్టుకున్న బంగారు పుస్తెల తాడును భద్రంగా బాధితురాలికి అందజేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెంకటేశ్వర కాలనీకి చెందిన వైష్ణవి అనే మహిళ మట్టపల్లి బైపాస్ రోడ్డులోని విటి టెంపుల్ వద్ద ఒక లోకల్ ఆటో ఎక్కారు. ఆమె పాత బస్టాండ్ వద్ద దిగిపోయిన తర్వాత, తన బంగారు పుస్తెల తాడు ఆటోలో జారిపోయినట్లు గమనించారు. బాధితురాలు వెంటనే హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా ఎస్ఐ నరేష్ తక్షణమే స్పందించారు. పట్టణంలోని సిసి కెమెరా ఫుటేజీలను క్షుణంగా పరిశీలించి, సదరు మహిళ ప్రయాణించిన ఆటోను అత్యంత వేగంగా గుర్తించారు. వెంటనే ఆటో డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు పలిపించి ఆటోను తనిఖీ చేయగా అందులో పుస్తెల తాడు లభ్యమైంది. రికవరి చేసిన బంగారు పుస్తెను హుజూర్‌నగర్ పోలీసుల సమక్షంలో బాధితురాలికి సురక్షితంగా అందజేశారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి, అతి తక్కువ సమయంలోనే తన పోగొట్టుకున్న పుస్తెను తిరిగి ఇప్పించినందుకు బాధితురాలు వైష్ణవి హుజూర్‌నగర్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వం సంక్షేమ పథకాల సద్వినియోగం



ప్రజాపక్షం/మునగాల: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల రెవిన్యూ అధికారి మంజుల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దళితులను ఎలాంటి వివక్ష లేకుండా చూడాలని, దళితులు ప్రభుత్వం అందించే పథకాలను ఉపయోగించుకోవాలని, దళిత వాడల్లో మౌళిక సదుపాయల కోసం వారి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ప్రభుత్వం ఎన్నో రకాలుగా కృషి చేస్తుందన్నారు. సర్పంచ్ వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ దళితులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న శిఖం భూములకు పట్టాలు ఇప్పించి వారికి ఉన్న పావు ఎకరం, అర ఎకరం భూమిని బ్యాంకుల నుండి రుణాలు పొందే అవకాశం ఇవ్వాలని, వారు ఆర్థికంగా ఎదగడానికి రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, జీపీవో గోపినాథ్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ షేక్ సలీంబాబా, రవికుమార్, నీలిమా, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, రేపూరి బాబు, మాదాసు ప్రభాకర్, మీసాల రామ్మూర్తి, మంద వెంకటేశ్వర్లు, మంద ఆదాం, వెంకయ్య పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి



ప్రజాపక్షం/నడిగూడెం: మండలంలోని వల్లాపురం గ్రామంలో సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్ పారిశుద్ధ్యం, స్వచ్ఛత పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం వర్షకాలం కావడంతో గ్రామంలో పలు నాలాలలో మురికి నీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలలో దృష్టి కేంద్రీకరించి వాటిని శుభ్రం చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా 4వ, 7, 8, 10, 11 వార్డులలో నాలాలలో పేరుకుపోయిన చెత్తచెదారాను జెసిబి సాయంతో తొలగించారు. గత కొన్ని సంవత్సరాలుగా వీధుల్లో వర్షపు నీరు నిల్వ ఉండి పరిష్కారం గాని సమస్యను సర్పంచ్ దగ్గరుండి పరిష్కరించారు. గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించారు. గత కొంత కాలం నుండి పరిష్కారం కాని పారిశుద్ధ్య పనులను నూతన సర్పంచ్ పరిష్కరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



## సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : గ్రామంలో కుల వివక్ష లేకుండా సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ ఇటుకల శ్రీను అన్నారు. మంగళవారం మండలంలోని మాచారం గ్రామంలో పోలీస్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే (పౌర హక్కుల దినోత్సవం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సామరస్యపూర్వక వాతావరణంలో అన్నాదమ్ముల్లా జీవించాలని కోరారు. అనంతరం పెన్‌పహాడ్ ఎస్ఐ కస్తాల గోపికృష్ణ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనని, చట్టం ముందు అందరూ సమానులేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్ మున్నీసా బేగం, ఎంఈఓ నకిరేకంటి రవి, పంచాయితీ కార్యదర్శి ఎలగందుల వెంకటలక్ష్మి, గంగారపు సతీష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## కార్మికులకు పింఛన్లు ఇవ్వాలి




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : వయస్సుతో సంబంధం లేకుండా భవన నిర్మాణ కార్మికులకు ఫించన్లు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పవద్దని కోరుతూ సూర్యాపేట ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌డిఓ వేణుమాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఉపయోగం లేని సిఎస్‌సి హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలన్నారు. సహజ మరణాలకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇల్లు లేని నిరుపేద కార్మిక కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటి సభ్యులు సాయికుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి శివ కృష్ణకుమార్, పెయింటర్ యూనియన్ అధ్యక్షుడు పాముల ఉపేందర్, వీరన్న, బాబా, రఫీ పాల్గొన్నారు.

## బిసి స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : బిసి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పోలోజు మహేష్ చారి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కళాశాలల బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.8,500 కోట్ల బకాయిలను విడుదల చేసి ఇంటర్ నుంచి ఉన్నత విద్య వరకు అర్హులైన ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలను బంద్ చేసి ఐదు లక్షల మంది విద్యార్థులతో భారీ ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి సాయితేజ, కల్లూరు అభి, రిషి, జయచంద్ర పాల్గొన్నారు.





## పౌర హక్కుల దినోత్సవం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని కరివిరాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరు పౌర హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, హక్కులతో పాటు బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వహించాలని పౌరలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారోజు పార్వతమ్మ, ఆర్ఐ గోపి కృష్ణ, జిపివో నర్సింహారావు, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకన్న మృతి పార్టీకి తీరనిలోటు



**ప్రజాపక్షం/చివ్వెంల :** బయ్య వెంకన్న మృతి పార్టీకి తీరనిలోటని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మండలంలోని తిరుమలగిరి(జి) గ్రామానికి చెందిన బయ్య వెంకన్న అనారోగ్యంతో మరణించగా మంగళవారం ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అన్ని విధాల కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, నాయకులు దుబ్బాక ప్రభాకర్ రెడ్డి, చెన్నోజు నరసింహా చారి, పిట్ట వెంకటరెడ్డి, కంచర్ల సుధాకర్ రెడ్డి, మంచికంటి గోపిరెడ్డి, బోలక వెంకటేశ్వర్లు, పబ్బు నాగరాజు, బోలక సైదులు పాల్గొన్నారు.

## సిమెంట్ బల్లాలు ఏర్పాటు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మున్సిపాలిటీ పరిధిలోని 7, 8 వార్డులలో మంగళవారం 7వ వార్డు కౌన్సిలర్ జ్యోతి శేఖర్ ఆధ్వర్యంలో సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కౌన్సిలర్ జ్యోతి మాట్లాడుతూ 44,800 రూపాయల విలువ చేసే 16 సిమెంట్ బల్లాలను ప్రధాన కూడలిలో ప్రజలు కూర్చోవడానికి సౌకర్యంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌన్సిలర్‌తో పాటు దాతలు శివనేని విజయ్ తండ్రి శివనేని రామనర్సయ్య జ్ఞాపకార్థం, దేవులపలి శంకరచారి తండ్రి దేవులపల్లి వెంకటచారి జ్ఞాపకార్థం, బొల్లెద్దు నాగరాజు తల్లి బొల్లెద్దు రాములమ్మ జ్ఞాపకార్థం, పొగబత్తిని శేఖర్ తండ్రి లక్ష్మయ్య జ్ఞాపకార్థం వీరందరి ఆర్థిక సహకారంతో 7, 8 వార్డులలో బల్లాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



# ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు త్వరలోనే పిఆర్‌సి

**ప్రజాపక్షం/కోదాడ:** ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు త్వరలోనే మంచి ఫిట్మెంట్ పిఆర్‌సి రాబోతుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య ఆహ్వానం మేరకు కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో జరిగిన సామూహిక జన్మదిన వేడుకలు, జిల్లాస్థాయి క్రీడా సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. త్వరలో హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిఆర్‌సి, సిపిఎస్ వంటి తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ఒప్పుకున్నదని త్వరలోనే అవి కార్యరూపం దాల్చనున్నాయని అన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఏనాడు కూడా తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వాలను మార్చే శక్తి పెన్షనర్ల చేతిలోనే ఉందన్నారు. రావెళ్ల సీతారామయ్య కృషితోనే తాను రాష్ట్ర అధ్యక్షుడిగా అయ్యానని ఈ సందర్భంగా సీతారామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం సంఘ సభ్యుల శ్రేయస్సు కోసం పరితపించే సీతారామయ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. అనంతరం జూన్ నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను సామూహికంగా నిర్వహించారు. జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో గెలిపించిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు వేనేపల్లి శ్రీనివాసరావు, బొల్లు రాంబాబు, ప్రహ్లాదరావు, శంకర్‌రెడ్డి, దండా మధుసూదన్‌రెడ్డి, పందిరి రఘువరప్రసాద్, తమ్మనబోయిన వీరబాబు, ఎస్దాని, బాలేమియా, భ్రమరాంబ, భూపాల్‌రెడ్డి, వరకాలజానయ్య పాల్గొన్నారు.



# ప్రతి అర్హుడి పేరూ ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కోడి శిరీష శివ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బిఎల్‌ఓలకు ప్రజలు పూర్తి సహకారం అందించి, పేర్లు, చిరునామా మార్పులు, మరణించిన వారి వివరాలు, ఇతర సవరణలను సకాలంలో తెలియజేయాలని సూచించారు. పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్ కొండపల్లి దిలీప్‌రెడ్డి, జిల్లా యువజన నాయకులు ఎలిమినేటి అభినయ్, దండు మైసమ్మ దేవాలయ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, అన్నమయ్య రాము పాల్గొన్నారు.



## బడి బాగు పడాలంటే ఉపాధ్యాయుల నియామకాలు జరగాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు మెరుగవ్వాలన్నా, బడి బాగు పడాలన్నా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల నియామకాలు తక్షణమే జరగాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బకల్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి అక్కడ ఉన్న లోపాలను పరిశీలించారు. మధ్యాహ్న సమయంలో ఆయన వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వారిలో అత్యధిక శాతం వెనుకబడిన, దళిత, నిరుపేద కుటుంబాలకు చెందిన వారే ఉన్నారని, వారికి అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థులకు సమగ్రమైన విద్యా విధానాన్ని అందించేదుకు వీలుగా ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలుగా మార్చాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న వంట మనుషుల సమస్యలు దయనీయంగా మారాయని, ఒక్కో విద్యార్థికి వంట ఖర్చుల కింద ఇచ్చే నిధులను పదిహేను రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. నూతన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు, కేవలం నియోజకవర్గానికి ఒక పబ్లిక్ స్కూల్ కాకుండా ప్రతి మండలానికి మూడు చొప్పున మోడల్ పాఠశాలలను నిర్మించి అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఆరుబయట కూర్చోకుండా డైనింగ్ హాళ్లు నిర్మించాలని, మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రవి నాయక్, మల్లు గౌతమ్ రెడ్డి, బావుండ్ల పాండు, తిరుపతి, రామ్మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు కందుల సాగు వైపు మళ్ళాలి

**ప్రజాపక్షం/గుండాల;** ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఖరీఫ్‌లో వర్షపాతం అస్థిరంగా ఉండే అవకాశం ఉన్నందున మండల రైతులు తక్కువ నీటితో సాగు చేయగల కందుల పంట సాగువైపు మళ్ళాలని వ్యవసాయ శాఖ సూచించింది. గుండాల మండల రైతు వేదికలో పిఆర్‌జి 176 రకం కంది విత్తనాలు 142 సంచులు అందుబాటులో ఉన్నాయని మొదటి ప్రాధాన్యత క్రమంలో పంపిణీ చేయడం జరుగుతుందని రైతులు త్వరితగతిన సంప్రదించి సబ్సిడీ విత్తనాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి సూరజ్ సూచించారు. రైతు భరోసా పథకానికి కొత్త దరఖాస్తుల స్వీకరణ మరియు బ్యాంక్ ఖాతా వివరాల సవరణ ప్రక్రియ ప్రారంభమైందని అర్హులైన రైతులు తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.



## డబుల్ బెడ్‌రూం ఇండ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలోని బాలాజీనగర్‌లో గత ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో మౌలిక సదుపాయలు కల్పించి, తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని బిజెపి పార్టీ నాయకులు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి కోరారు. మంగళవారం బిజెపి జిల్లా కమిటీ సభ్యులు జనార్ధన్ ఆధ్వర్యంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జనార్ధన్ మాట్లాడుతూ ప్రజాధనంతో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు లబ్ధిదారులకు అందక, సదుపాయలు లేక వృధాగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌నాయక్, యాద నవీన్, సంధ్యారాణి, క్రాంతి, అన్నపూర్ణ, సైదాబి, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐ పోస్టును భర్తీ చేయాలి

**ప్రజాపక్షం/మునగాల:** సుమారు రెండు నెలలుగా ఖాళీగా ఉన్న మునగాల ఎస్ఐ పోస్టును వెంటనే భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎంపిపి ముల్కలపల్లి రాములు ఉన్నతాధికారులకు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మునగాల మండలంలో జాతీయ రహదారిపై ఉండటం వల్ల రోజు ప్రతినిత్యం యాక్సిడెంట్లతో పాటు భూతగాదాలు ఇతర సమస్యలతో ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తే స్థానికంగా ఎస్ఐ పోస్టు ఖాళీ ఉండటంతో బాధితులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వెంటనే ఖాళీగా ఉన్న మునగాల ఎస్ఐ పోస్టును భర్తీ చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిటిషన్ ఇచ్చి స్టేషన్ హౌస్ ఆఫీసర్ లేకపోవడంతో రోజుల తరబడి న్యాయం కోసం ఎదురు చూస్తున్నా బాధితులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. జిల్లా ఎస్‌పి, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని వెంటనే మునగాల ఎస్ఐ పోస్టును భర్తీ చేయాలని కోరారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/చండూరు:** శిథిలా వ్యవస్థలో ఉన్న చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు నూతన భవనం మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండమీది శ్రీశైలం అన్నారు. మంగళవారం సిపిఎం నాయకులతో కలిసి ఆయన చండూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పిహెచ్‌సి లో సిబ్బంది కొరత ఉందని తక్షణమే పూర్తి స్థాయిలో ఆరోగ్య సిబ్బందిని నియమించి రోగులకు వైద్య సేవలు అందించాలని అన్నారు. నిత్యం చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వందల సంఖ్యలో రోగులు వస్తుంటారని వారికి సరైన వసతులు లేక ఇబ్బందులు పడవల్సి వస్తుందని అన్నారు. పిహెచ్‌సిలో ఉన్న ప్రధాన సమస్యలను , మండల వైద్యాధికారి డాక్టర్ మాన రాజు, డాక్టర్ సంధ్య బెస్సీని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెరిపోతుల ధనుంజయ్య గౌడ్, సిపిఎం మండల కమిటీ సభ్యులు మొగుదాల వెంకటేశం , ఈరటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన మాదూరు రాము ఇటీవల మరణించడంతో మానవసేవే మాధవసేవ నినాదంతో ముందుకెళ్తున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం రాము కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ రూ. 5016లను ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసం నగేష్, మాజీ ఎంపిటిసి మల్లయ్య పాల్గొన్నారు.

## మసాన్‌పల్లి పాల సంఘం చైర్మన్‌గా ముత్తమ్మ



**ప్రజాపక్షం/గుండాల;** యాద్రాది భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారంపురం గ్రామ పాల సంఘం చైర్మన్‌గా కాళీ వెంకన్న మంగళ వారం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటు పాడి రైతులకు కావాల్సిన దాన విషయంతో రాజీ లేకుండా దాన ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## ఘనంగా ప్రసాద్ వసంతక్కల వర్ధంతి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కామ్రేడ్ ఎంవి ప్రసాద్, వసంతక్కల 21వ వర్ధంతిని సిపిఐ ఎంఎల్ రామచంద్రన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళ వారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నకిరికంటి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సభలో బుద్ధ సత్యనారాయణ, సిపిఐ ఎంఎల్ రామచంద్రన్ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్‌లు మాట్లాడుతూ కామ్రేడ్ ఎంవి ప్రసాద్, వసంతక్కలు పేద ప్రజల పక్షాన నిలబడి భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి అసవులు బాసారని కొనియాడారు. ఈ వర్ధంతి సభలో నాయకులు వెంకన్న, భాస్కర్, చామకూరి నర్సయ్య పాల్గొన్నారు.

## స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని ఓగోడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 50 మంది పేద విద్యార్థులకు నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త,శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ గజ్జల సూర్యప్రకాశ్ సహకారంతో ఈకార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీర్లపాటి పద్మ,క్లబ్ కార్యదర్శి సూర్యచంద్ర రావు,తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల పెన్షనర్ల సంఘం నకిరేకల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి అధ్యక్షత వహించగా,డాక్టర్ సుశ్రుత సంతోష్ కుమార్ పెన్షనర్ల ఆరోగ్యంపై సూచనలు చేస్తూ 6180 ఏళ్లు పైబడిన వారు ఆరోగ్యంగా,ప్రశాంతంగా జీవించాలని కోరారు.ఆకవరం బ్రహ్మయ్యసరోజన దంపతులు తమ తల్లి దండ్రులు దివంగత ఆకవరం సూరమ్మకోటయ్య జ్ఞాపకార్థం భోజనాన్ని ఏర్పాటుచేశారు.ఈసందర్భంగా పి.జనార్దన్ రెడ్డి,ఎల్. కృష్ణయ్య, జి. సాంబయ్య,పి. నరసయ్య,పి.బిక్షం రెడ్డి, ఎస్. లచ్చయ్య, బి. శంభులింగం, ఇక్బాల్ అహ్మద్,టి.

# అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** అంకితభావంతో,నిబద్ధతతో పనిచేసిన వారికి సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన నకిరేకల్ మండల మార్కెట్ వాచ్‌మెన్ యాసారపు అంజయ్య,కడపర్తి గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎర్ర యాదగిరిని శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలో నిజాయితీగా విధులు నిర్వహించిన వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం ఇద్దరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత,మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర రావు నాయకులు పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న, చౌగోని శ్రీనివాస్ ,లతీఫ్ పాల్గొన్నారు.

# రైతుల అవసరాలకు సరిపడా నిల్వలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతుల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులోనే ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి వల్లోజు వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన రైతులకు యూరియా ఎరువు నిరంతరాయంగా అందేలా చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారి వల్లోజు వినోద్ కుమార్ మిర్యాలగూడలోని యూరియా రేక్ పాయింట్, మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ గోదాంను సందర్శించి నిల్వలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం సాగు పనులు వేగంగా కొనసాగుతున్న సమయంలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. గోదాంలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించి సరఫరా వ్యవస్థపై సమీక్ష నిర్వహించారు. మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ గోదాంలో సుమారు 20 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ సిద్ధంగా ఉందని అధికారులు గుర్తించారు. జిల్లాలోని వివిధ మండలాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూరియా నిల్వలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఒకేసారి అధిక మొత్తంలో కొనుగోళ్లు చేయకుండా అవసరమైన మేరకే ఎరువులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువుల కొరతపై ఎలాంటి అపోహలకు తావు లేదని అధికారులు పేర్కొన్నారు. ఆయన వెంటే ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి, ఏవో రుషేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



**ప్రజాపక్షం/నకిరేకల్:** సమాజంలో జ్ఞాన సుగంధాన్ని వెదజల్లే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని నకిరేకల్ మండల విద్యాశాఖ అధికారి మేక నాగయ్య అన్నారు.మంగళవారం తాటికల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్ బోయినపల్లి రమణారావు ఉద్యోగ విరమణ వీడ్కోలు,సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.బోయినపల్లి రమణారావు మూడున్నర దశాబ్దాలకు పైగా విద్యారంగంలో అంకితభావంతో విశిష్ట సేవలు అందించి ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కానుగుల చంద్రకళ,పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్లు మన్నెం రాధ,పార్వతి,జగతయ్య,చకిలం వేణుగోపాల రావు,రాజేంద్రప్రసాద్,యాదగిరిరావు,ఉదయశ్రీ, ఉపాధ్యాయులు ఉమారాణి,హరికృష్ణ,ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ వ్యవసాయంలో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే రైతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని కానీ కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతు స్వరాజ వేదిక ప్రతినిధి కొండల్ రెడ్డి అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల ఎమ్మార్వో రవికుమార్, వ్యవసాయ శాఖ అధికారికి కౌలు రైతుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ కౌలు సాగు దారులకు పంట సీజన్ మొదట్లోనే ఒకేసారి గుర్తించి గుర్తింపు కార్డు ఇవ్వాలని, గుర్తించిన సాగుదారులకు ఈ సంవత్సరంలో పథకాలు, పంట కొనుగోలు వగైరా నేరుగా వారి పేరు మీదనే లభించాలని తెలిపారు. కౌలు సాగుదారు గుర్తింపు చట్ట ప్రకారం నిర్దిష్టంగా జరగాలని, ఓటిపి వ్యవస్థ మాత్రమే కాకుండ 2011 సాగు దారు చట్టంలో సూచించినట్లు కౌలు రైతుల నుండి దరఖాస్తు తీసుకొని, గ్రామస్థాయి విచారణలో నిర్ధారించుకొని గుర్తింపు ఇవ్వాన్నారు. ఈ ఖరీఫ్ లోనే ఎరువులు, పంట నష్టపరిహారం, పంట బీమా, పంట కొనుగోలు, రైతు బీమా వంటి పథకాలు నేరుగా అందజేసి, భూ యజమానుల భూమి హక్కులకు భంగం లేదని హామీ ఇస్తూ ప్రభుత్వం ప్రచారం చేయాలని, వెంటనే కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విలాస్, కౌలు రైతుల సాధన కమిటీ మెంబర్లు స్వప్న, కృష్ణ, ఫాతిమా, రైతు నేస్తం అధ్యక్షులు గూడ రాజిరెడ్డి, స్వర భారతి, ఉపాధ్యక్షురాలు కలాషికం సుచరిత, బుక్ కీపర్లు తదితరులు పాల్గొన్నారు.



## పాల సంఘం చైర్‌పర్సన్‌గా శైలజ



**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ పాల ఉత్పత్తి సహకార సంఘం అధ్యక్షురాలిగా పోల్‌రెడ్డి శైలజమహేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం రోజున ఖాళీ అయిన రెండు డైరక్టర్ స్థానాలకు జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వలిగొండ వసంత, బండా అలివేలు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన పోల్‌రెడ్డి శైలజమహేందర్ రెడ్డి, గోపగోని హేమలత, కంకల పద్మ, రత్నం అండాలు, అచ్చిన అంజమ్మ, కొత్త లింగమ్మ, గోపగోని శెట్టి, రెడపాక బాబులు డైరక్టర్‌గా పదవీలో కొనసాగుతున్నారు. మెజార్టీ సభ్యులు బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారు ఉండటంతో అధ్యక్షురాలిగా పోల్‌రెడ్డి శైలజమహేందర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శైలజను గ్రామ సర్పంచ్ బత్తుల లక్ష్మి ప్రసన్న, రాష్ట్ర బిఆర్‌ఎస్ నాయకులు రాచకొండ కృష్ణయ్య, నాయకులు కోయగూర నర్సింహ్మా, బీమిడి చినవెంకట్‌రెడ్డి, గోపగోని నర్సింహ్మా తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రైతుల అభివృద్ధే సంఘం లక్ష్యం



**ప్రజాపక్షం/తిప్పర్తి :** సహకార సంఘాలు చేపడుతున్న వివిధ అభివృద్ధి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు."సహకార సంఘాల ద్వారా రైతులకు అందే సబ్సిడీ పథకాలతో ఎంతో మేలు జరుగుతుందని రైతులు సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు.మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్)ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సమృద్ధి వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగాపిఎసిఎస్ చైర్మన్ పాశం సంపత్ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు అందే సబ్సిడీ పథకాలతో ఎంతో మేలు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జ్యోతి, గోదా కృష్ణారెడ్డి,బ్రాంచ్ మేనేజర్ మాధవి,సీఈఓ బిక్షమయ్య, అవినాష్ రెడ్డి,శేఖర్,పాలక వర్గ సభ్యులుపాల్గొన్నారు.

## సమాజానికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఉద్యోగ జీవితం ముగిసినా సమాజానికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి దయానందరాణి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంజెడ్ ఫంక్షన్ హాల్‌లో డిటిడిఓ అధికారి కొమ్ము శంకర్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు, సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శంకర్ తన ఉద్యోగ జీవితంలో నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెన్నెల, సూర్య, వినీల, వసతి గృహ సంక్షేమ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత బస్సు పాస్ మేళా

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తడక రమేష్ యువసేన ఆధ్వర్యంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని రేపు స్థానిక పద్మశాలి సభా వేదిక వద్ద దివ్యాంగులకు ఉచిత బస్సు పాస్ మేళను నిర్వహించనున్నట్లు టీఆర్ యువసేన అధ్యక్షుడు వలం దాస్ ప్రవీణ్ తెలిపారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, యాదగిరిగుట్ట డిపో మేనేజర్ సురేష్ కుమార్ హాజరవుతున్నారని అర్హులైన వారు అధిక సంఖ్యలో హాజరై బస్సు పాస్ మేలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## పాల సంఘం చైర్మన్‌ను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు నీల చెన్నకేశవులను దుబ్బాక పాల సంఘం చైర్మన్ గా మంగళవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌ను బిఆర్ఎస్ నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండాల రాంబాబు, నాయకులు ఆవుల శ్రీధర్, గుండాల శేఖర్, సింగారపు రమేష్, వరికుప్పల పెద్ద మైసయ్యజ్, శాంతి కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సుంకిశాలలో ఘనంగా జల మహోత్సవ వేడుక

**ప్రజాపక్షం/నాంపల్లి** : గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల పునరుద్ధరణ,కట్టల మరమ్మతులు,శ్రమదానం కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది. ప్రభుత్వం ఎంతో వ్యయంతో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా సురక్షితమైన నీటిని అందిస్తోంది అని స్థానిక సర్పంచ్ కలకొండ దుర్గయ్య అన్నారు. భూగర్భ జలాలు అంతరించిపోకుండా కాపాడుకోవడం,ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యంగా మండలంలోని సుంకిశాల గ్రామంలో మంగళవారం జల మహోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి పెద్దయ్య, దేవత్‌పల్లి సర్పంచ్ ముదిగొండ ఏసు,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## 'విబి- జి రామ్‌జి' పథకాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్** :కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీఆర్ఏఎంజీ పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది.మంగళవారం మండలంలోని మంగళపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించి గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు సాకుంట్ల నరసింహ, కార్యదర్శి మర్రి వెంకటయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించకుండా కొత్త విధానాలను తీసుకొస్తోందని విమర్శించారు. సంఘం మండల నాయకులు మర్రి బక్కయ్య ఒంటెపాక జమదగ్ని,బచ్చుపల్లి లక్ష్మణ రావు,అంతటి వెంకటయ్య,నర్సింగ్ జోజి,మేడి వెంకటయ్య, వేరేపల్లి ఎల్లయ్య, ఏసు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/రామన్నపేట** : నీర్నెములగ్రామానికి చెందిన కన్నెబోయిన కృష్ణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని వారి భార్య ఐనటువంటి కన్నెబోయిన పూజతో రోజూ వారి పనులలో కలిసి పనిచేసే స్నేహితురాళ్ళు అందరూ కలిసి వారి కుటుంబానికి రూ.10000 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో వారి కుటుంబానికి మనం ఇచ్చిన ఈ చిన్న సహాయం కొంతమేర ధైర్యం ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## కౌలు రైతులకు రైతు భరోసా పథకం వర్తింపచేయాలి

**ప్రజాపక్షం/చండూరు:** కౌలు రైతులకు రైతు భరోసా పథకం ద్వార నిధులను మంజూరు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బండమీది వెంకన్న తెలంగాణ ప్రభుత్వాన్ని చేశారు. మంగళవారం ఆయన చండూరులో మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకోవాలని , భూమి పట్టా ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడ రైతు భరోసా కల్పించాలని అన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా క్రింద ఎకరంకు 12 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలోని కాంగ్రేస్ ప్రభుత్వం ప్రతి కౌలు రైతుకు ఎకరంకు 12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు వ్యవసాయం పెట్టుబడి పెట్టి ,కౌలు డబ్బులు చెల్లించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. యూరియా స్లాట్ బుకింగ్ వల్ల చదువురాని రైతులు ఇతరుల మీద ఆదరపడవలసి వస్తుందని అన్నారు. ఎకరం ఉన్న రైతు ఒక యూరియా బ్యాగ్ కోసం 10 కిలోమీటర్ల దూరం వెళ్లి బస్తా యూరియా తెచ్చుకునే పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వం ఆలోచన చేసి వెంటనే యూరియా యాప్ స్లాట్ విధానంను రద్దు చేసి ,రైతులకు అన్ని దుకాణాలలో యూరియాను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

# కళాశాలల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కళాశాలల బంద్‌కు మిర్యాలగూడలో విశేష స్పందన లభించింది. బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో పలువురు విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ బీసీ విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, స్కాలర్‌షిప్‌లు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం వల్ల వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జక్క నాగేశ్వరరావు, సిద్ధం రాజు, పట్టేటి రమేష్, మునగాల శైలేందర్, ఉపేందర్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అభినవ యూత్ అసోసియేషన్‌కు జాతీయ పురస్కారం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : హైదరాబాదులో శనివారం ఇన్స్పైట్ ఎక్సెన్స్ అవార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైడ్ ఆఫ్ సౌతర్న్ ఇండియా అవార్డ్స్ 2026 కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని భూదాన్ పోచంపల్లి పట్టణానికి చెందిన అభినవ యూత్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకమైన ఇన్స్పైరింగ్ యూత్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అధ్యక్షులు జోగు రవీందర్ కోశాధికారి కొయ్యడ లింగ స్వామిలు అందుకున్నారు.యువత సాధికారత, సామాజిక సేవ మరియు సమాజాభివృద్ధి రంగాల్లో సంస్థ చూపిస్తున్న విశిష్ట సేవలు, సమాజంపై సానుకూల ప్రభావానికి గుర్తింపుగా ఈ గౌరవం లభించిందనీ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రముఖ సినీ నటి, మాజీ రాజ్యసభ సభ్యురాలు జయప్రద చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందని మరింత సామాజిక బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ అవార్డు సంస్థ సభ్యులందరి సమిష్టి కృషికి, సేవా




భావానికి, సమాజం పట్ల ఉన్న అంకితభావానికి దక్కిన గుర్తింపు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ యువతకు ఆదర్శంగా నిలవాలని సంస్థ సంకల్పించి సంకల్పించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డు ఎంపిక కమిటీకి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

## బిఎల్ఓ కార్యక్రమం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం కుమ్మరిగూడెం గ్రామంలో ఎస్ఐఆర్ బిఎల్ఓ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఎస్ఐఆర్ బిఎల్ఓ కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం, ప్రాముఖ్యత, ప్రయోజనాలు గురించి గ్రామస్తులకు వివరించారు. గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం, వారి అభిప్రాయాలు మరియు సలహాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధికి కావలసిన సమాచారం అందించబడింది. గ్రామస్తుల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. చందుపట్ల పిఏసిఎస్ మాజి చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి, కంకల కిష్టయ్య, రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి అక్రమాలపై స్వతంత్ర విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని కల్మల్‌చెర్వు గ్రామ సంఘ బంధం 1 పరిధిలోని స్త్రీ నిధి లావాదేవిల్లో జరిగిన అక్రమాలపై స్వతంత్ర విచారణ చేపట్టాలని మాజీ వివోఏ, అంతర్జాతీయ పారా వాలిబాల్ క్రీడాకారుడు అమరారపు సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్త్రీనిధి బకాయిలు వసూలు చేసే విషయంలో అవకతవకలు జరిగాయని ఆయ న ఆరోపించారు. 2022 నుంచి 2024 వరకు అధికారులు నిర్వహించిన తనిఖీలు సంఘ సభ్యులు, నాయకులతో మాట్లాడకుండా కార్యాలయ స్థాయిలోనే ముగించాలని తెలిపారు. సంఘ సభ్యులు చెల్లించిన సుమారు రెండు లక్షల 85వేల నిధులను సంబంధిత సంఘాలకు సమాచారం ఇవ్వకుండా తిరిగి పంపిచాలని తెలిపారు. ఒక లక్ష66 వేల రూపాయల లావాదేవులపై ఇప్పటికే స్పష్టత లేదని పేర్కొన్నారు. తాను సెలవుల్లో ఉన్నసమయంలో జరిగిన పరిణామాలపై బాధ్యుడిగా చేస్తూ ఒత్తిడి తెచ్చిపత్రాలపై సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. అనంతరం 2024 ఆగస్టు 29న తాను బాధ్యత నుంచి తప్పుకుని రాజీనామా చేశానని తెలిపారు. తాను సెలవులపై వెళ్లిన సమయంలో స్త్రీనిధి ఖాతాలో అవకతవకలు జరిగినట్లు వాటిని గుర్తించినట్లు సైదులు పేర్కొన్నారు. కల్మల్‌చెర్వు సంఘబంధం 1 లావాదేవిలపై స్వతంత్ర విచారణ నిర్వహించి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కోతులాపురం పొట్ట మౌనిక,చిమిర్యాల విజయ్ కుమార్, రామచంద్ర రెడ్డి,చిల్లాపురం కావలి మధు, లబ్ధిదారులకు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందిన పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరట నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, పార్టీ మండల కార్యవర్గ సభ్యులు పొట్ట శంకరయ్య, సుర్వి నరసింహ, గ్రామ శాఖల కార్యదర్శులు కొప్పు సుధాకర్ పాల్గొన్నారు.

## పాల సంఘం చైర్మన్‌గా మంచాల జంగయ్య ఎన్నిక

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : జనగాం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (పాల సంఘం) చైర్మన్ గా మంచాల జంగయ్య ఎన్నికయ్యారు.ఇటీవల నిర్వహించిన పాల సంఘం పాలక వర్గ సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ మద్దతుతో ఆయనను చైర్మన్ గా ఎన్నుకున్నారు. సందర్భంగా నూతన చైర్మన్ మంచాల జంగయ్య మాట్లాడుతూ పాల ఉత్పత్తి దారుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ పాల రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతానని తెలిపారు. పాల సేకరణను పెంచడంతోపాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జంగయ్య ఎన్నిక పట్ల సిపిఐ మండల పార్టీ నాయకత్వం ప్రజాసంఘాలు శుభాకాంక్షలు తెలిపారు.



## కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : అందరూ కలిసికట్టుగా ఐక్యంగా పోరాడి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని పోచంపల్లి మండల రెడ్డి సంఘం కన్వీనర్ గంగిడి సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో మంగళవారం జరిగిన సమావేశంలో జిల్లాలోని రెడ్డి సంఘం నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు పలువురు నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ పార్లమెంటులలో ఎలాంటి రిజర్వేషన్లు లేనప్పటికీ ప్రజాసేవ చేస్తూ ప్రతినిధులుగా ఉన్నారని వారిని సంప్రదించి ప్రత్యేక చొరవతో కార్పొరేషన్ ఏర్పాటు చేసుకుని ప్రత్యేక నిధులు కేటాయించేలా ఒత్తిడి తేవాలని ఆకాంక్షను వెలిబుచ్చారు. తర్వాత జారేషన్ మొత్తం విదేశాల్లో స్థిరపడ్డారని సీనియర్లుగా అందరి ఉనికి ప్రశ్నార్థకంగా మారనుందని ఆయన అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే హక్కుల కోసం సంఘటితంగా పోరాడే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తం

**ప్రజాపక్షం/నిడమనూరు:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అరవింద్ సూచించారు.మంగళవారం మండల పరిధి శాఖ పురం గ్రామంలో తమ సిబ్బందితో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇమామ్, సర్పంచ్ చేకూరి సూర్యనారాయణ, వైద్య సిబ్బంది మేరీ స్టేల్లా,వినయ్ కుమారి,మంజుల,పద్మ,భవాని పుష్పలత,మౌనిక తదితరులున్నారు.



## నోటు పుస్తకాలు పంపిణీ

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని గూడూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామానికి చెందిన బోయపల్లి శంకర్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు గోవర్ధన్ రెడ్డి దయాకర్ రెడ్డిలు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. దయాకర్ రెడ్డి గోవర్ధన్ రెడ్డిలో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్ రెడ్డి, ఉపసర్పంచ్ జానా సత్యనారాయణ, వార్డు సభ్యులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ సన్మానం




**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని బోగారం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ముస్కు వెంకట్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డాక్టర్ సర్వేపల్లి రాధాకిషన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాల చైర్మన్ పబ్బు జ్యోతి, ఉపసర్పంచ్ బైకాని ఉమామహేష్ యాదవ్, వార్డు నెంబర్లు, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు, శ్రేయోభిలాషులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అవార్డుల కోసం దరఖాస్తులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రసన్న ఆరూహి ఆర్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో 12న విజయవాడలో నిర్వహించే సినీ గాన విభావరి ఉత్తమ ప్రతిభా నంది ,సింహ అవార్డుల కొరకు అన్ని కేటగిరీల వారు ఈనెల 7 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఈవెంట్ కన్వీనర్,డాక్టర్ ఆలూరి విల్సన్ పేర్కొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సంఘ సేవకుడు,ఉత్తమ డాన్సర్, ఉత్తమ కళాకారుడు,ఉత్తమ గాయకుడు, ఉత్తమ నటుడు,ఉత్తమ ఉపధ్యాయుడు,అవార్డుల ప్రధానోత్సవం 2026 నమోదు కొరకు ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అన్ని కేటగిరీలకు అవార్డులు అందజేయబడునని తెలిపారు. దరఖాస్తులు వాట్సప్ నెంబర్ 9494861669కి షేర్ చేయాలని సూచించారు.

## ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాపక్షం/వేములపల్లి :** వేములపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలలో 2026/27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రిన్సిపల్ దీన సుజాత తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మోడల్ స్కూల్,కాలేజీలో చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయి. అర్హులైన విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో నేరుగా పాఠశాలలో సంప్రదించి ప్రవేశం పొందవచ్చు అని ఆమె పేర్కొన్నారు.

# బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపడతామని హెచ్చరించారు.జూలై 1 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్12 కార్యక్రమం నేపథ్యంలో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులు,ఆపరేషన్ ముస్కాన్ బృందం సభ్యులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలను ఏ విధమైన ఉపాధిలోనైనా పనిచేయించడం చట్టవిరుద్ధం. హోటళ్లు, టీ దుకాణాలు,గ్యారేజీలు,పరిశ్రమలు, వర్క్‌షాప్‌లు,నిర్మాణ పనులు,వ్యవసాయ క్షేత్రాలు, గృహ పనులు,వ్యాపార సంస్థల్లో బాల కార్మికులు ఉన్నారనే సమాచారం వచ్చిన వెంటనే సంయుక్త బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి అని ఆదేశించారు. ఎక్కడైనా బాలకార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలు,వీధి బాలలు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్100కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పి రమేష్, డిఎస్‌పిరవి కుమార్, జడ్‌పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,సీడబ్ల్యూసీ ఛైర్మన్ కృష్ణయ్య,ఏహెచ్‌టీయూ ఎస్ఐఅంజలి,ఆపరేషన్ ముస్కాన్ బృందం సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




**పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి సన్మానం**

జిల్లా పోలీసు శాఖలో 35 ఏళ్ల పాటు నిజాయితీగా సేవలందించి పదవీ విరమణ పొందిన ఎఎస్ఐలు చంద్రమోహన్,పండరయ్య,హెడ్ కానిస్టేబుల్లు రమేష్, జానీ పాషా, కానిస్టేబుల్ నజీరుద్దీన్‌లకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘన వీడ్కోలు పలికారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ వారిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

# పరెడ్డిగూడెంలో వీరగంగాదేవి తల్లి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని పరెడ్డిగూడెం గ్రామంలో వీరగంగాదేవి తల్లి వెలసి 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరగంగాదేవి ఆలయంలో కేక్ కట్ చేసి భక్తులు గ్రామ ప్రజల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు సర్వారం పిఎసిఎస్ మాజీ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మి దంపతుల కుమార్తె చిన్న వయసులో మృతి చెందగా అనంతరం వారి స్వస్థలంలో వీరగంగాదేవి తల్లి వెలసిందని భక్తుల విశ్వాసం, అప్పటి నుండి గ్రామప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రజల కోరికలు నెరవేరుతున్నాయని నమ్మకంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. తల్లి ఆలయ ప్రాంగణంలో వీరన్నస్వామి, నాగదేవత, సుబ్రమణ్యస్వామి వినాయకుడు మైసమ్మ తల్లి దేవతల ఆలయాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం వార్షికోత్సవాలు, బోనాల పండుగ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. తమ కుమార్తెపై ఉన్న ప్రేమతో వీరగంగాదేవి తల్లి జన్మదిన వేడుకలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు.

# యూరియా యాప్‌ను రద్దు చేయాలని ధర్నా

**ప్రజాపక్షం/సూర్యాపేట (నూతనకల్) :** యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని నూతనకల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ కమిటి సభ్యులు ముప్పాని సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా యాప్‌ను తీసుకువచ్చి దాని ద్వారానే యూరియాను బుక్ చేసుకోవాలని కోరడం సరైనది కాదన్నారు. దీనివల్ల అనేక మంది అమాయక రైతులు ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోవడంతో పాటు బుకింగ్ చేసుకోవడం రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు అధిక ధరలకు యూరియాను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. యూరియాను బుక్ చేసుకోలేదని ఇచ్చిన తక్కువ బస్తాలు ఇస్తూ బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనికితోడు నకిలీ విత్తనాలతో రైతులు పంట సాగు చేసి నష్టపోతున్నారని వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దగ్గుళ్ళ మల్లయ్య, జటంగి సతీష్, ముండ్ల మల్లయ్య, పిల్లి వీరయ్య, ఉమేష్, రామకృష్ణ, పిడమర్తి అంజయ్య, సామ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

# సిసి కెమెరాల ఆవశ్యకతను గుర్తించాలి

**ప్రజాపక్షం/హాలియా:** మారుమూల గ్రామాలలో జరుగుతున్న కొన్ని అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు సీసీ కెమెరాల పాత్ర కీలకమైందని ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ తెలిపారు. సోమవారం రాత్రి హాజారిగూడెం గ్రామంలోని శివాలయంలో జరిగిన దొంగతనం మండలంలో కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే.ఇదే విషయమై ఎస్ఐ సాయి ప్రశాంత్ ప్రజాపక్షం ప్రతినిధితో మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న కొన్ని అసాంఘిక కార్యకలాపాలను గుర్తించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం ఎంతో ఉంటుందని చెప్పారు. రాత్రి వేళలో జరుగుతున్న దొంగతనాలను గుర్తించేందుకు ఈసీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. మండ లంలోని కొన్ని గ్రామాలలో ప్రజాప్రతినిధులు, యువకులు,వ్యాపారులు ముందుకు వచ్చి తమ గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్న తీరును అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. అందువలన మిగిలిన గ్రామాల వారు కూడా ఈ సీసీ కెమెరాలను అమర్చుకోవాలని చెప్పారు.సీసీ కెమెరాల ప్రాధాన్యత ఎంతో ఉంటుందని పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో అన్ని గ్రామాలలో అవగాహన సమావేశాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. గత 15 రోజుల క్రితం ఒక గ్రామంలో పండుగ సందర్భంగా మహిళలతో అశ్లీల నృత్యాలు చేపించారనే ఫిర్యాదులు ఆలస్యంగా వచ్చాయని అప్పటికే కార్యక్రమం అయిపోవడంతో తమకు సమాచారం చెప్పేందుకు ఎవరు ముందుకు రాలేదని తెలిపారు.



## ఎంజియులో 12 పార్ట్‌టైం అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు.ఈనోటిఫికేషన్ ద్వారా మొత్తం 12 పార్ట్‌టైం అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నారు. విభాగాల వారీగా ఖాళీల వివరాలు రసాయన శాస్త్రం 1,ఫిజిక్స్2, వృక్ష శాస్త్రం1,ఇంజనీరింగ్ విభాగంలో ఈఈఈ1, ఈసీఈ1, ఇంగ్లీష్1,సీఎస్ఈ,ఎంసీఏ2,తెలుగు1,సైకాలజీ1.నోటిఫికేషన్‌కు సంబంధించిన అర్హతలు,వయోపరిమితి,ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు రిజిస్ట్రార్ తెలిపారు.అర్హత,ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సంబంధిత కళాశాలలో సమర్పించాలని ఆచార్య అంజిరెడ్డి సూచించారు.మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో

స్క్రాప్ మెటీరియల్ వేలం.

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఉన్న స్క్రాప్ మెటీరియల్‌ను వేలం ద్వారా శుక్రవారం ( జులై 3) మధ్యాహ్నం 1:30 గంటలకు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి తెలిపారు.ఆసక్తి గల వ్యక్తులు,ఏజెన్సీలు నిర్దేశిత తేదీ,సమయానికి హాజరై వేలంలో పాల్గొనవలసిందిగా ఆయన తెలిపారు. వేలం నిబంధనలు, మెటీరియల్ వివరాలు మరియు ఇతర సంబంధిత సమాచారం కోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫసర్ అకుల రవిని (9948361250) సంప్రదించవచ్చన్నారు.

## బిఆర్‌ఎస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అర్వపల్లి మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు గరిగంటి శ్రీకాంత్, నాగెల్లి సంపత్‌లతోపాటు పలువురు ఆ పార్టీకి రాజీనామా చేసి బిఆర్‌ఎస్‌లో చేరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న అప్రజాస్వామిక విధానాలను నిరసిస్తూ ఆ పార్టీ యువ నాయకులు స్వచ్ఛందంగా బిఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, పాల సొసైటీ మాజీ చైర్మన్ చల్లా వేణుధర్ రెడ్డి, సర్పంచ్ బొడ్డు ఇందిరా సోమరాజు, ఉపసర్పంచ్ దేశిడి సందీప్‌రెడ్డి, వార్డు మెంబర్లు ఆదె శోభారాణి మధు, బొల్లం ప్రభాకర్, ఉప్పు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పౌర హక్కుల దినోత్సవం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో మంగళవారం (సివిల్ రైట్ డే) పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి తుర్కపల్లి తహశీల్దార్ రవి కుమార్, తుర్కపల్లి పోలీసులు పాల్గొని గ్రామస్థులకు స్వేచ్ఛ, సమానత్వం, పారదర్శకత పై అవగాహన కల్పించారు. కుల వ్యవస్థ నిర్మూలన, సహపంక్తి భోజనాలు, దేవాలయాలోకి రానియకపోవడం, ఒక కులానికి పెద్ద పీటవేయడం, మరో కులాన్ని తక్కువ చేసి చూడటం వంటి విషయాలపై చైతన్యం కల్పించి, గ్రామ ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని తెలపడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతి రెడ్డి, ఉపసర్పంచ్ నగాయపల్లి శివరాములు, వార్డుమెంబర్ బత్తుల అనిల్ కుమార్, ఆర్ఐ రఘు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తేనే...

**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి :** అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు,గౌరవం లభిస్తాయని ఎంఈఓ కె. నరసింహ ,పిఆర్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ లు అన్నారు.మండలంలోని అమ్మనబోలు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొన్నే శంకర్ గౌడ్ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోపిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు బత్తిని భాస్కర్ గౌడ్,బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్,జిల్లా అధ్యక్షుడు కాశయ్య గౌడ్ పాల్గొన్నారు.





## మున్సిపల్ వైస్ చైర్మన్‌ను పరామర్శించిన ఎంపి

**ప్రజాపక్షం/హాలియా:** గతవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హాలియా మున్సిపల్ వైస్ చైర్మన్ గౌనీ రాజా రమేష్ యాదవ్‌ని నల్లగొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి పరామర్శించారు. మంగళవారం హాలియాలోని వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ ఇంటికి వచ్చిన ఎంపీ రఘువీర్ రెడ్డి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత నల్గొండ లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో రాజా రమేష్ కు శస్త్ర చికిత్స చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీ రఘువీర్ రెడ్డి పరామర్శించి ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎంపీ వెంట ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాకునూరు నారాయణ గౌడ్ ఉన్నారు.

## సిసి కెమెరాలు రక్షణ నేత్రాలు

ప్రజాపక్షం/చివ్వెంల ః ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామానికి రక్షణ నేత్రాలుగా ఉపయోగపడుతాయని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐలాపురం గ్రామంలోని ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను డీఎస్‌పి ప్రసన్న కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, గ్రామ సర్పంచ్ నక్క పద్మ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అధికారుల సేవలు ఎప్పటికీ ఆదర్శం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ః** విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో సేవలందించిన అధికారుల సేవలు ఎప్పటికి ఆదర్శంగా నిలుస్తాయని సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాజస్వ మండల అధికారి కార్యాలయ సీనియర్ సహాయకులు బాల్నె అంజయ్య పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు, సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.

## చిన్నారికి అండ

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి మండలం ముత్తిరెడ్డి గూడెంకు చెందిన గంగాదేవి జ్యోతి ఇటీవల మృతి చెందారు. ఆమెకు ఒక కుమార్తె నందిత, ఒక చిన్న కుమారుడు ఉన్నారు. తల్లి మరణంతో చిన్నారుల భవిష్యత్తుకు బస్వాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS) 2012/13 పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు నందిత పేరు పై పోస్టాఫీస్లోని కిసాన్ వికాస్ పత్ర (KVP) పథకం కింద రూ.70,000 స్థిర పెట్టుబడి (FD) చేశారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా భవిష్యత్తులో నందిత విద్య, అవసరాలకు కొంత భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఇస్తున్నట్లు మంగవారం పోస్ట్ ఆఫీస్ భువనగిరిలో జ్యోతి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో 201213 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖం చాటిన వరుణుడు...వాడిన కర్షకుని మోము...





### జులై వచ్చినా కురవని వానలు...
### ఖరీఫ్ సాగుపై ప్రభావం...
### ఆవిరి అవుతున్న రైతులు ఆశలు...

**ప్రజాపక్షం/హాలియా:** జులై వచ్చినా కరుణించని వరుణుడితో ఖరీఫ్ సీజన్ కష్టకాలంలో పడింది. ఎన్నో ఆశలతో ఖరీఫ్ సీజన్ ప్రారంభించాలనుకున్న అన్నదాత ఆశలకు ఆదిలోనే అడ్డంకులు ప్రారంభమయ్యాయి. మే నెల చివర్లో ఒకటి రెండు వర్షాలకు పత్తిని విత్తిన రైతులు మళ్లీ చినుకు లేక విత్తన మొలకెత్తక అల్లాడుతున్నారు... జులై నెల ప్రారంభమవుతున్నా ఇప్పటివరకు భారీ వర్షం ఏది లేకపోవడంతో సాగుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆలమట్టి నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న సాగునీటి డ్యాములు మొత్తం అడుగంటి వరుణుడి రాక కోసం ఆవురావురుమని ఎదురుచూస్తున్నాయి. జూలై నెలలో కూడా ఆశించిన వర్షాలు పడనట్లయితే ఖరీఫ్ సీజన్ కు ఓ విధమైన క్రాఫ్ హాలిడే ప్రకటించినట్లే అవుతుంది. ఈ ప్రభావం అన్ని రంగాలపై పడనుండడంతో రైతులు ఆకాశం వైపు చూస్తూ వరుణా ఒక్కసారి కరుణించయ్య అంటూ వేడుకుంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో వరినాట్లకు సిద్ధం కావలసిన రైతులు వరి నార్లు కూడా పోయలేని పరిస్థితి నెలకొన్నది అంటే వరుణుడి ప్రభావం ఏమైనా ఉందో స్పష్టం అవుతుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాలు సాగులోకి రావాల్సి ఉండగా ప్రస్తుతం పదివేల ఎకరాలు కూడా సాగు చేయలేని దుస్థితిలో రైతులు ఉన్నారు. వర్షాలు బొత్తిగా లేకపోవడం వలన ఆల్మట్టి డ్యాం కూడా నీరు లేక ఇబ్బంది పరిస్థితుల్లోనే ఉండడం మూలంగా దాని పరిధిలోని డ్యాములు కూడా నీరు లేక వెలవెలబోతున్నాయి. గత ఏడాది ఆగస్టు నాటికే సాగునీరు రావడంతో గత ఖరీఫ్ సాగుతో కళకళలాడింది. ఈ ఏడాది ఇప్పటివరకు భారీ వర్షాలు లేకపోవడం వలన నాగార్జునసాగర్ డ్యాం నీరు లేక వెలవెలబోతుంది. జులై నెల నుండి ఆగస్టు మొదటి వారం వరకు భారీ వర్షాలు కురిస్తే సాగర్ డ్యామ్ లోకి 550 అడుగులు నీరు చేరితే తప్ప ఖరీఫ్ సీజన్ కు సాగు నీరు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా వరుణుడు కరుణించి తమ సాగుకు ఊతమిస్తే తప్ప ఖరీఫ్ సాగు ముందుకు కదిలే పరిస్థితి లేదు.

# నేరాల నియంత్రణలో నాణ్యమైన దర్యాప్తే కీలకం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నేరస్థులకు శిక్ష పడాలంటే దర్యాప్తు బలంగా ఉండాలని, ప్రతి కేసులో శాస్త్రీయ పద్ధతులు, సాంకేతిక సాక్ష్యాలను సమర్థంగా వినియోగించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా పోలీసు శాఖలో కేసుల దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచే దిశగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మిర్యాలగూడ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల కేసులకు సంబంధించిన ఫైల్స్, దర్యాప్తు రికార్డులు, పెండింగ్ వ్యవహారాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసు నమోదు చేయడం మాత్రమే కాకుండా దర్యాప్తును సమర్థంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడటం పోలీసు శాఖ బాధ్యత అన్నారు. ముఖ్యంగా హత్యలు, దోపిడీలు, మహిళలపై నేరాలు, బాలలపై నేరాలు, సైబర్ మోసాల కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, కేసులు సంవత్సరాల తరబడి నిలిచిపోకుండా వేగంగా పూర్తి చేయాలని సూచించారు.నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునే సమయంలో సాక్ష్యాధారాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి కేసులో ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు, సాంకేతిక సమాచారాన్ని సక్రమంగా సేకరించడం ద్వారా దర్యాప్తు మరింత బలపడుతుందని తెలిపారు.ఈ తనిఖీలో మిర్యాలగూడ రూరల్ సీఐ పి.ఎన్.డి. ప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విద్యార్థులను ప్రభుత్వాలు,రాజకీయపార్టీలు పట్టించుకోవడం లేదని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కళాశాలల బంద్ విజయవంతమైందని ఆయన తెలిపారు.జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10వేలు కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.ఫీజు బకాయిల కారణంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో ఉద్యోగాలు,ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.8,9 వల్ల విద్యార్థుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.ఆజీవోలను వెంటనే రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో రజక అభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు సతీష్,విద్యార్థి సంఘం నాయకులు కొంపల్లి రామన్న గౌడ్,అనంత నాగరాజు గౌడ్,గడగోజు విజయాచారి,నాగేష్,హరిప్రసాద్, కృష్ణ, మహేష్, శివ, మధు, మల్లేష్, నరేష్, పృథ్వీరాజ్,మణికంఠ తదితరులు పాల్గొన్నారు.




## గుర్రంపోడులో జరిగే ఎఐటియుసి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాపక్షం/డిండి; మంగళవారం డిండి మండలంలో ఏఐటీయూసీ మండల కార్యవర్గ సభ్యుల సమావేశం భుష్పక లింగమయ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ మండల కార్యవర్గ సభ్యులు నూనె వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ దేశంలో 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని స్వాతంత్రానికి పూర్వమే కార్మక సంఘాల చట్టం, ఫ్యాక్టరీల చట్టం, శ్రామిక విధానాల చట్టం, కనీస వేతనాల చట్టాలను ఏఐటీయూసీ సాధించడం జరిగిందని అన్నారు. ఏఐటీయూసీ నాయకత్వంలో అనేక పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న ముఖ్యమైన 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4 కోడ్లుగా కుదించి, కార్పొరేట్ సంస్థలకు గుత్తపెట్టుబడిదారులకు అనుకూలంగా, కార్మికులకు నష్టం కలింగిచే విధంగా మార్పు చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఎలిమినేటి దేవయ్య, జిపి మండల అధ్యక్షులు జవహర్‌లాల్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సాయిలు, తిరుపతయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

## వేములపల్లిలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమ వీక్షణ



**ప్రజాపక్షం/వేములపల్లి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని మంగళవారం మండల కేందర్రంలోని రైతు వేదికలో రైతులు పెద్ద సంఖ్యలో దృశ్రావణ మాధ్యమం ద్వారా వీక్షించారు.ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల అభివృద్ధినే ధ్యేయంగా పెట్టుకొని రైతు భరోసా నిధులను విడుదల చేయడం హర్షణీయం. రైతులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలిఅని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీఏఓ వినోద్ కుమార్ రెడ్డి, ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్, ఏఈఓలు షఫీ,రమేష్, ప్రియాంక, సర్పంచులు పుట్టల సందీప్ కుమార్, చక్కని సత్యం, పిల్లల సందీప్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన మున్సిపల్ కమిషనర్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు.కార్యక్రమానికి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు హాజరై పదవీ విరమణ పొందిన శరత్ చంద్రను పూలమాలతో ఘనంగా సన్మానించారు. నగర అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది,ప్రముఖులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని శరత్ చంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.

